క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థి ఎంపిక

బుక్కరాయసముద్రం: రోటరీపురం జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న పగిడి పల్లి శిరీష అనే విద్యార్థి నేషనల్ మీన్స్ కంమెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం లక్ష్మీదేవి తెలిపారు. శిరీషకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందన్నారు.

ఘనంగా సుంకులమ్మ దేవర

గుత్తి: స్థానిక సీపీఐ కాలనీలో ఆదివారం సుంకులమ్మ దేవరను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు పొట్టేళ్లు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన,ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 సాలాగ్రామ శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

హంతకుడిని కఠినంగా శిక్షించాలి

గుంతకల్లుటౌన్: నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన రమాదేవి అనే దళిత యువతిని ప్రేమపేరుతో వంచించి దారుణంగా హత్యచేసిన నిందితుడు జాఫర్‌ను కఠినంగా శిక్షించాలని దళిత ఐక్యవేదిక పట్టణ అధ్యక్షుడు వై.ఆనంద్ డిమాండ్ చేశారు. యువతి హత్యను ఖండిస్తూ ఆదివారం దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. బాధితురాలి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు సూరి, ఓబులేసు, మస్తాన్, రంగస్వామి, అరుణ్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శరత్ చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్యల ఆధ్వర్యంలో ఆదివారం శానిటేషన్ సిబ్బంది స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు మురుగు కాలువలు శుభ్రం చేశారు. చెత్తా చెదారాన్ని తొలగించారు. అపరిశుభ్రతను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు. అలాగే సాయంత్రం పలు వార్డుల్లో దోమల ఆవాసాల్లో ఫాగింగ్ చేపట్టారు.

బాలుడిపై కుక్క దాడి



కుక్క దాడిలో గాయపడిన నాని

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఓ బాలుడిపై కుక్క దాడి చేసింది. వివరాలు.. నాని అనే బాలుడు ప్రభుత్వాస్పత్రి సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. స్థానికులు గమనించి బాలుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం సినీనటుడు రామ్‌చరణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా రామ్‌చరణ్ అభిమాన సంఘం నాయకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రామ్ చరణ్ అభిమాన సంఘం జిల్లా నాయకులు సురేష్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 72 మంది యువతీ యువకులు రక్తదానం చేశారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ అభిమాన సంఘం నాయకులు పాటిల్ సురేష్, బ్రహ్మయ్య, ఊటకల్లు ఓబులేసు, శరత్, దుర్గా ప్రసాద్, రంగస్వామి, రఫీ, అలీ, వెంకటరాముడు, శ్రీనివాసులు, ఆర్‌బీ కృష్ణ మూర్తి, ధనుంజయ, హోటల్ శేఖర్, నరేష్ రాయల్, హరినాథ్ రాయల్, చిన్నా, సూరి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో గ్రామీణ వైద్యం

యల్లనూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న వైద్యుల కొరతను తీరుస్తోంది. చాలా ఏళ్లుగా తాత్కాలిక పద్ధతిలో వైద్యులను నియమించేవారు. దీంతో చాలామంది వైద్యులు మారుమూల ప్రాంతాల్లో ఉద్యోగం చేయడం ఇష్టం లేక మధ్యలోనే వెళ్లిపోవడంతో పోస్టులు ఖాళీగా ఉండేవి. ఇద్దరు డాక్టర్లు ఉన్న చోట ఒక్కరే విధుల్లో ఉండేవారు. పల్లెల్లో నాడిపట్టే వైద్యులు లేక రోగులు నానా అవస్థలు పడుతూ పట్టణాలకు వెళ్లేవారు. ఈ సమస్యను చెక్ పెట్టేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా శాశ్వత వైద్యుల నియామకానికి శ్రీకారం చుట్టింది.

రెండు పీహెచ్‌సీలకు నలుగురు వైద్యులు

ప్రస్తుతం యల్లనూరు పీహెచ్‌సీకి ఇద్దరు పురుషులు వైద్యులుగా విధుల్లో చేరారు. అలాగే తిమ్మంపల్లి పీహెచ్‌సీకి నూతనంగా మహిళా వైద్యురాలిని నియమించారు. ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున నలుగురు డాక్టర్లు ఉన్నారు. జలుబు, దగ్గు, జ్వరం, కీళ్లనొప్పులు, వాంతులు, విరేచనాలు, చికెన్‌గున్యా, ప్రసవాలు, పురుగుల మందుతాగిన, పాముకాటు వంటి అత్యవసర కేసులను యల్లనూరు, తిమ్మంపల్లి పీహెచ్‌సీల్లోని వైద్యులు చికిత్సలను అందిస్తున్నారు. గతంలో ఆయా పీహెచ్‌సీల్లో సరైన వైద్యులు లేక, పరికరాలు లేక దగ్గు, జలుబుకు కూడా తాడిపత్రి ఆసుపత్రులకు పరుగులు తీసేవారు. ప్రస్తుతం అన్ని రకాల జబ్బులకు వైద్యం చేస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.



నిట్టూరు గ్రామంలో ఇంట్లో వైద్యం అందిస్తున్న వైద్యుడు శివసాయి

50 పల్లెలకు సేవలు

యల్లనూరు పీహెచ్‌సీ పరిధిలో 21 గ్రామాలు, 16040 జనాభా, సచివాలయాలు 6 ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఎల్లప్పుడూ వైద్యుల పర్యవేక్షణ ఉంది. అలాగే తిమ్మంపల్లి పీహెచ్‌సీ పరిధిలో 20 గ్రామాలు, 18,572 జనాభా, సచివాలయాలు 8 ఉన్నాయి. గతంలో అరకొర వైద్య సిబ్బంది ఉండటంతో ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్య సేవలు అందేవి కావు. ప్రస్తుతం వైద్యుల కొరత తీరింది. కావాల్సినంత మంది ఆరోగ్య సిబ్బంది ఉండటంతో పల్లెల్లో వైద్యం మెరుగుపడింది. ఇప్పటి వరకు సబ్ సెంటర్లలో కేవలం టీకాలు, తల్లీబిడ్డకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తుండేవారు. ఏఎన్‌ఎంల ఆధ్వర్యంలో కొనసాగిన ఈ సెంటర్లు ప్రస్తుతం ఎంబీబీఎస్ వైద్యుల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దాదాపు 80 శాతం చికిత్సలు అందుతున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో ఉన్న ల్యాబ్‌లో మరో కొన్ని రకాల రక్త పరీక్షలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గ్రామీణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డెంగీ, టైఫాయిడ్ లాంటి విష జ్వరాలతో బాధపడుతున్న వారికి తక్షణమే మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. పల్లె ప్రజలకు సంబంధించి గుండెజబ్బులు, క్యాన్సర్లు, బీపీ, షుగర్, కిడ్నీ సంబంధిత వ్యాధులను ముందే గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకునేలా సూచనలు సలహాలు ఇస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యంతోపాటు మందులు అందిస్తున్నారు.

అన్ని కేసులకు వైద్యం



యల్లనూరు పీహెచ్‌సీలో అత్యవసర కేసులు, సాధారణ కేసులను తీసుకుంటున్నాం. గర్భిణులకు ప్రత్యేక వైద్యంతో పాటు ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. మా పీహెచ్‌సీ పరిధిలో 21 గ్రామాలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ఇద్దరు డాక్టర్లు ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నాం. అన్ని కేసులకు వైద్యం చేస్తాం.

– డాక్టర్ లోకేష్‌కుమార్, యల్లనూరు పీహెచ్‌సీ

ఆస్పత్రుల్లో అన్ని వసతులు



తిమ్మంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. నూతనంగా పీహెచ్‌సీ పనులు జరిగాయి. 20 గ్రామాల ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నాం. అన్ని వేళల్లో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నాం. ఎలాంటి కేసులైనా చికిత్స అందిస్తాం.

– డాక్టర్ కీర్తన, తిమ్మంపల్లి

వైద్యఖర్చులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం



క్షతగాత్రుడి కుటుంబసభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: గోడకూలి తీవ్రంగా గాయపడిన 33వ వార్డుకు చెందిన సాయి కార్తీక్ అనే భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో క్షతగాత్రుడి కుటుంబ సభ్యులకు వైవీఆర్ ట్రస్ట్ తరపున చేయూతనందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ విద్యారాణి, వార్డు సచివాలయాల పట్టణ కన్వీనర్ జింకల రామాంజనేయులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని టి.కొత్తపల్లి గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం బొలెరో వాహనం దిగుతూ కిందపడి ఓ యువకుడు గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన దిలీప్ హైదరాబాదులో కూలీ పనులు చేసేందుకు బొలెరోలో బయలుదేరాడు. అయితే గ్రామ శివారులో కొందరు వాహనం ఆపి కాలకృత్యాలకు వెళ్లారు. దిలీప్ కూడా బొలెరో దిగుతూ కాలు జారి కింద పడ్డాడు. గాయపడిని అతడిని వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అసెంబ్లీ తీర్మానంపై వాల్మీకుల సంబరాలు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకులకు ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపడంపై ఆదివారం ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం లిఖిత, మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు ఆధ్వర్యంలో పామిడిలో ఆదివారం సాయంత్రం సంబరాలు చేసుకున్నారు. స్థానిక వీరా స్వగృహం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వాల్మీకులు వైఎస్సార్ విగ్రహం వరకూ భారీ ర్యాలీ చేపట్టారు. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలపూలలు వేసి నివాళులర్పించారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎం లిఖిత, ఎం వీరాంజనేయులు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తానన్న హామీ మేరకు బిల్లు ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వాల్మీకులు జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ మంగమ్మను ఘనంగా సన్మానించారు. దాదాపు 2 వేల మందికి మాంసాహారం భోజనం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ మంగమ్మ, 56 కార్పొరేషన్ల సలహాదారు పులివెందుల ప్రవీణ్, రామచంద్ర, ఉరవకొండ మార్కెట్‌యార్డు డైరెక్టర్ శ్రీలేఖ, వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్, ఆత్మకమిటీ చైర్మన్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఘటననూ ఎమ్మెల్యేకు ఆపాదించడం తగదు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ భాస్కర్

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజకవర్గంలో ఏ సంఘటన జరిగినా వాటిని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డికి ఆపాదించడం తగదని జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శింగనమల నియోజక వర్గంలో ఏ చిన్న సంఘటన జరిగినా వాటిని ఎమ్మెల్యేకు అంటగట్టి దళిత సంఘం నేతలు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తాను దళిత సంఘాల్లో పని చేశానని, ఏనాడు సంబంధం లేని వ్యక్తులపై ఇలా మాట్లాడలేదన్నారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోయిన రమాదేవి కుటుంబ సభ్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారన్నారు. ఇదే విషయాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతోపాటు రెవెన్యూ, పోలీసు అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు చేపట్టారన్నారు. ఒక దళిత ఎమ్మెల్యే అని కూడా చూడకుండా నోటికి ఏదొస్తే అది మాట్లాడడం దారుణమన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తాడిపత్రి టౌన్: పట్టణంలోని 17వ వార్డు వినాయక కాంప్లెక్స్ నుంచి సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

బాలిక ఆచూకీ లభ్యం

యాడికి: ఈ నెల 17న అదృశ్యమైన బాలిక ఆచూకీ లభించింది. పదో తరగతి పరీక్షలు బాగా రాయకపోతే పెళ్లి చేస్తామని కుటుంబ సభ్యులు అన్నందుకు మండల కేంద్రానికి చెందిన బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పెద్దమ్మ ఊరికి పోయింది. బాలిక పెద్దమ్మతో పాటు పోలీస్‌స్టేషన్‌కు రాగా విచారించి సీడబ్ల్యూసీ ఎదుట హాజరు పరిచి బాలికను తలిదండ్రులకు అప్పగించామని ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో పేకాట ఆడుతున్న 12 మందిని ఆదివారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.19 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగంలో ఖాళీగా ఉన్న రెండు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్ఞానేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 2, 4, 6 సెమిస్టర్ తరగతులను బోధించడానికి ఎంకామ్‌లో 55 శాతం మార్కులు కలిగి పీహెచ్‌డీ, నెట్, స్లెట్ పూర్తి చేసిన అధ్యాపకులు ఈ నెల 31వ తేదీ ఉదయం కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు తప్పనిసరిగా తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లను తమ వెంట తీసుకురావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఉల్లాసంగా ఉట్ల పరుష



ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

నార్పల: స్థానిక తిక్కయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉట్ల పరుష ఉల్లాసంగా జరిగింది. ఉదయం నుంచి తిక్కయ్య స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం 3 గంటల అనంతరం టెంకాయ కొట్టు, ఉట్లమాను పందెం నిర్వహించారు. కోలన్న, భజనలు చేశారు. స్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపుతో పరుషను ముగించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచు మన్నీల సుప్రియ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, బాలనాగి శీనా, మొరుసు రమణారెడ్డి, గవ్వల సుబ్బయ్య, చికెన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు



యల్లనూరు: పదవ తరగతి ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపర్చారు. ఏప్రిల్ 3న జరుగబోయే పది పరీక్షల కోసం ప్రశ్నపత్రాలు యల్లనూరుకు చేరాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

సమాజంపై అవగాహన అవసరం

గుంతకల్లు రూరల్: సమాజంలోని పరిస్థితులపై విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కృష్ణయ్య సూచించారు. ఆదివారం శ్రీ శంకరానందగిరీ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల బృందం ఆధ్వర్యంలో మండల పరిధిలోని కసాపురంలో నిరక్షరాస్యత, నిరుద్యోగంపై ఇంటింటా సర్వే నిర్వహించారు. 15 నుంచి 29 ఏళ్లలోపు ఉన్న నిరుద్యోగ యువతీ యువకుల వివరాలను సేకరించి ఆ వివరాలను భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖకు పంపనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ పీఓ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవరుచుకోవాలని సూచించారు.

విషాహారం తిని ముగ్గురికి అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని కొజ్జేపల్లి గ్రామంలో ఆదివారం బల్లి పడిన అన్నం తిని ముగ్గురు కూలీలు అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన రాజు, మల్లేశ్వరి, సుభద్రమ్మలు గ్రామంలో వ్యవసాయ కూలీ పనులకు వెళ్లారు. పనులు చేసిన అనంతరం ఇంటి నుంచి తెచ్చుకున్న క్యారియర్‌లో భోజనం చేస్తూ అస్వస్థతకు గురయ్యారు. సగం అన్నం పూర్తయిన క్యారియర్ చూస్తే అందులో బల్లి పడి ఉంది. వెంటనే వారిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

ఘటన స్థలి పరిశీలన



హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మందకృష్ణ

బుక్కరాయసముద్రం: స్థానిక దేవరకొండ సమీపంలోని చెరువులో దళిత యువతి రమాదేవి హత్య జరిగిన ప్రదేశాన్ని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ ఆదివారం పరిశీలించారు. రమాదేవి హత్యపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ దళితులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రమాదేవి మిస్సింగ్ కేసులో పోలీసులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. హంతకుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర నేతలు సాకే హరి, చంద్ర పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని కమలాపురం, బూదేడు క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది వివరాల మేరకు.. కొప్పలకొండకు చెందిన నాగన్న అనే వ్యక్తి పాములాయి చెరువులో శనివారం రాత్రి చేపల వేటకు వెళ్లి ఉదయం బైక్‌పై ఇంటికి వెళ్లాడు. కమలాపురం సమీపంలోకి రాగానే కునుకు తీయడంతో బైక్‌పై నుంచి పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతడిని 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రున్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.అలాగే యర్రగుంట్లకు చెందిన ఖాసీంవలి, షాజహాన్ బైక్‌పై గార్లదిన్నెకు వెళ్తున్న సమయంలో బూదేడు క్రాస్ సమీపంలో బైక్‌పై నుంచి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఆదివారం బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు..యాడికికి చెందిన రాము పని మీద బైక్‌పై గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. గుత్తిలోని తాడిపత్రి రోడ్డులో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను తప్పించబోయి బైక్‌పై నుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైతుల సమస్యలపై ఎమ్మెల్యే ఆరా



మేడిమాకుపల్లి వద్ద కొర్ర పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : మండలంలోని రైతుల సమస్యలపై తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆరా తీశారు. ఆదివారం పెద్దవడుగూరు, మేడిమాకుపల్లి గ్రామాల్లో అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈదురుగాలులు, వర్షానికి కొర్ర, జొన్న, మొక్కజొన్న , మామిడి పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. వ్యవసాయాధికారులు ఇచ్చిన నివేదికపై చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. హెచ్చెల్సీ ద్వారా రైతులకు రెండో పంటకు సరిపడా నీరు ఆయకట్టు చివరి వరకూ అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అందించని విధంగా ప్రస్తుతం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని గుర్తు చేశారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' మెగా చెక్కు పంపిణీ

యాడికి: మండల కేంద్రంలో చౌడేశ్వరీ కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 11: 30 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆనిమేటర్లు, ఆసరా లబ్ధిదారులు పాల్గొనాలని కోరారు.

పెద్దవడుగూరు : మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కును సోమవారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చెక్కును అందించనున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. మండలంలోని మహిళా సంఘాల సభ్యులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు , నాయకులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ఫంక్షన్ హాలు వద్దకు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

30న రాతి దూలం లాగుడు పోటీలు

పుట్లూరు: రంగమనాయునిపల్లి సీతారామాంజనేయస్వామి తిరునాలలో భాగంగా ఈ నెల 30న రాతి దూలం లాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందజేస్తామన్నారు. పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహిస్తామని వివరించారు.

28న కంటి వైద్యశిబిరం

పామిడి: పట్టణంలోని షాదీఖానాలో ఈనెల 28న పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా ఆయుష్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు ఆదివారం తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఓటర్, ఆధార్, రేషన్‌కార్డుల్లో ఏదోకటి లేదా ఏదైనా గుర్తింపుకార్డుల రెండు జిరాక్స్ కాపీలు, సెల్ నంబర్‌తో రావాలని సూచించారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



మోహిని రూపంలో శ్రీరాముడు

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్ ఆర్‌వీ స్వామి కల్యాణ మండపంలో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు రాత్రి మోహిని అలంకారంలో శ్రీరాముడు భక్తులకు దర్శనమిచ్చారు. రంగు రంగుల పూలతో ఆలంకరించిన స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భూమా హరినారాయణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆందోళనలు

గుంతకల్లు: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీ.జగదీష్ తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశాన్ని తిరోగమనం వైపు తీసుకుపోతున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 14 నుంచి మే 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేయనున్నామన్నారు. పార్లమెంట్‌లో అదాని అంశంపై ప్రతిపక్ష పార్టీలు, జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయమని కోరితే ఆ అంశాన్ని డైవర్ట్ చేసేందుకు రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని విమర్శించారు. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నిధులు కేటాయించి రాయలసీమ జిల్లాలను మోదీ ప్రభుత్వం ఏడారిగా మార్చేందుకు కుట్రలు పన్నిందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, నాయకులు మహేష్, గోపీనాథ్, రాము తదితరులు పాల్గొన్నారు.